

పాలగుమ్మి పద్మరాజు

# వాసన లేని పువ్వులు

రాజారావు పెళ్ళివిషయంలో చాలా అదృష్టవంతుడు వట్టి బి. ఏ. పాసయిన వాడికి అంత మంచి సంబంధం దొరకడమంటే నిజంగా జాతక ప్రభావమేనన్నారు స్నేహితు లందరూను. భార్య రూపవతి. మామగారు మగపిల్లలు లేని ధనవంతుడు

భార్య కాపురానికి వచ్చిన రెండు సంవత్సరాలలో రాజారావులో ఎంతో మార్పు వచ్చింది. ఎప్పుడూ ఆకాశంలోకి చూసేచూపులు ప్రస్తుతం ఎప్పుడూ నేలమీదే ఉంటాయి. కొంచెం మనిషి వాడినట్టు కనబడుతాడు. చిక్కిపోలేదు. ఇదివరక లాగ ప్రతి విషయాన్ని గురించీ అతిగా, ఉత్సాహంగా మాట్లాడే అలవాటు పోయి, అతను ఇప్పుడు ముభావంగా, ముక్తసరిగా, సాధారణంగా పరధ్యానంగా ఉంటుంటాడు. అతను చదువుకునే రోజుల్లో, ఎప్పుడూకూడా, ఒకప్పుడు తను తాలూకా గుమాస్తాపని చెయ్యాపోతానని అనుకోలేదు. అతను లేనివాడే. కాని ఊహలు ఆదర్శాలూ లేనివాడు కాడు. అందులో ఈ పెళ్ళి అయినతరవాత అతనికి అలాంటిపనిలో ప్రవేశించవలసిన అవసరమేలేదు. మామగారూ, అత్తగారూ కూడా వద్దని ఎంతచెప్పినావినక అతను ఆ పనిలో ప్రవేశించాడు. అతనికి ఎంతోమందిమీద కసి తీర్చుకోవాలని తీవ్రమయిన వాంఛ అకారణంగా కలిగింది. ...ఎవరిమీదో అతనికి

స్పష్టంగా తెలియదు. కొంతవరకూ తన మీదే కసి తీర్చుకోవలసిన అవసరం అతనికి కలిగిందని అతని అనుమానం.

అతను కాపురమున్న ఇల్లు విశాల మయిన ఒక సందులో ఉంది. ఇంటి చుట్టూ ఆవరణ ఉంది. ఏవో ఎర్రటి పువ్వులు పూసే మొక్కలు ఎన్నో ఉన్నాయి అతని భార్య ఆ పువ్వులు రోజూ సాయంకాలం కోసి తలలో పెట్టు కుంటుంది. మొట్టమొదట ఆ ఎర్రటి పువ్వులు చూసినప్పుడు రాజారావుకి విచిత్రమయిన ఆందోళన కలిగింది. వాటినికోసి వాసన చూశాడు ఏ వాసనా లేదు ఇంత రంగుగావున్న పువ్వులకు వాసన ఎందుకు లేదు ! ఇది చాలా అన్యాయంగా అతనికి తోచింది. ఆతనికి వర్డ్స్‌వర్త్ అంటే అభిమానం-తద్వారా ప్రకృతి అంటే కూడా అతను అధ్యాత్మి కంగా సామ్యవాది కూడా. వాసన అనే సంపదను అన్ని పువ్వులు సమంగా పంచుకోడం న్యాయమని ఆతని మన స్సులో అభిప్రాయం. అన్ని పువ్వులకు వాసన ఉన్నా లేకపోయినా ఈ ఒక్క రకం పువ్వులకు వాసనవుంటే అతని సామ్యవాద సిద్ధాంతాలకు అఘాతం తగ లకపోను. ఈ పువ్వులద్వారా ఆతనికి ఈ లోకంలో పంపకపు విధానం అసం దర్భంగా ఉందన్నసత్యం అనుభవం లోకి వచ్చింది. మొదటిరోజుల్లో మేడ మీద వసారాలో కూర్చుని ఆ పువ్వుల వేపు చూస్తూ ఉండేవాడు. కాని ఎప్పుడూ అతను దగ్గరకు వెళ్ళి వాటిని తనంతట తను ముట్టుకోలేదు, కొయ్యలేదు.

అతని భార్య రోజూ వాటినికోసిసాయం కాలం జడలో పెట్టుకోడం ప్రారంభించిన నాటినుంచీ అతనిలో రకరకాల ఉద్రే కాలు రేగుతుండేవి. తెల్లవారిన తరవాత ఆ వాసనలేని పువ్వులు అతని భార్య తలగడమీద వాడిపోయి పడివుండేవి. వాటి వాసనలేని వాసన అతనికి వెగ టుగా తగులుతుండేది. అతనికి రాత్రులు సరిగా నిద్రపట్టడంలేదు. ఏవో కలలు నిత్యమూ అతని తెలివికి దూరంగా వచ్చి పోతుండేవి. నిద్రలేచిన తరవాత ఒక్క కలా జ్ఞాపకం వుండేదికాదు. కాని అతని మనస్సు ఆ కల జరుగుతున్నంతసేపూ ఏదో మధనపడుతున్నట్టు మాత్రం జ్ఞాపకం వుండేది. ప్రొద్దున్న నిద్రలేచిన వెంటనే అతనికి ఎంతో నీరసంగా, బెంగగా వుండేది. భార్య తలలోంచి రాలిన వాడిపోయిన ఆ వాసనలేని పువ్వులు తలగడ పక్కన ఎర్రగా పడి వుండేవి. లోకమంతా వాడిపోయి క్రుంగి పోయినట్లు అతనికి అనిపించేది.

రాజారావు భార్య పేరు కమల. మొదటి రోజుల్లో ఆమెకు రాజారావు తత్వం విచిత్రంగా అస్వాభావికంగా కని పించేది. అతను ఏదో కళ అనేవాడు, ఆదర్శమనేవాడు. ఆమె చదువుకుని అభిరుచిని అలవరచుకోవాలనేవాడు;

పగలంతా ఏదో పనిలో మునిగిపోయిన ఆమెకు, అతను రాత్రి ఏదో ఉద్రేకంగా చెబుతుండే అవులింతలు, కునికిపాట్లు వచ్చేవి. క్రమంగా అతని మాటలు అర్థం చేసుకోడానికి ప్రయత్నించకుండా వినడం ఆమెకు అలవాటయిపోయింది. ఆమె జీవితంలో అదొక భాగంగా ఆమెకు స్థిర పడిపోయింది. అన్నం ఉడకడం, నూతులో నీళ్ళూరడం, వాకిట్లో ఎర్రటి వాసనలేని పువ్వులు పూయడం, రాజారావు రాత్రులు మాట్లాడడం అన్నీ ఆమెకు అలవాటయిపోయాయి.

కమల మంచి స్ఫురద్రూపి. నిగనిగలాడే పసుపురంగు దేహం. తగినంత లావు, తీర్చినట్లున్న దేహం, మొత్తంమీద ఆమె అందమయినదనే చెప్పాలి ఆమె శరీరం చల్లగా ఆరోగ్యంగా రాజారావు దేహానికి తగిలినప్పుడు అతనికి అకారణంగా చిరాకు కలుగుతుండేది. ఏదో తను మరచిపోయినట్టు అదేదో తనకే జ్ఞాపకం రానట్టు బాధపడేవాడు. ఆ మరిచిపోవడానికి కమల కొంత కారణమని అతనికి అజ్ఞాతంగా అనిపించేది.

రాజారావు కవిత్వం వ్రాయడం ప్రారంభించాడు. అతనికి అనేకమయిన ఉద్రేకాలు లోలోపల ఒత్తిడిచేస్తుండేవి అతను ఉపయోగించే మాటలకు వేరే అర్థం ఏదో ఉన్నట్లు స్ఫురించేది; ఏదో మాత్రం తెలిసేదికాదు ఒకొక్కరోజుని ఆఫీసులో కూర్చుని •గంటల తరబడి కొన్ని పదాలను మననం చేస్తుండేవాడు. 'వాసనలేని పువ్వులు' 'చల్లని ఒడలు' 'బెంగ' 'దిగులు' 'బరువు' మొదలయిన పదాలు అతని మనస్సులో తిరిగి తిరిగి ప్రత్యక్షమయేవి. సగం సగం వాక్యాలు, భావాలు పూర్తి కావడానికి వీల్లేని పద్య భాగాలు, చిన్న చిన్న కాగితాలమీద గిలుకుతుండేవాడు. అవన్నీ కోటుజేబులోకి ఎక్కించి ఇంటికి వస్తుండేవాడు. వాటిని నిత్యం మననం చేస్తుండేవాడు. చిత్రవిచిత్రమయిన విరుపులు, విలక్షణమయిన యతిప్రాసలు అపురూపమయిన నడకలు, అతనికి అందీఅందకుండా అల్లా జారిపోతుండేవి.

"వాసనలేని పువ్వులు అనే పద్యం ఎంతోమంది మెచ్చుకున్నారు. కొందరు శైలిని పొగిడారు కొందరు భావాన్ని, కొందరు శిల్పాన్ని, మొత్తంమీద రాజారావు కవి అని నిర్ధారణ అయింది పదిమందీ అతన్ని కవిగా అంగీకరించారు. ఆ వుత్సాహ మతన్ని కవిగాచేసింది. వరసగా వ్రాత మొదలుపెట్టాడు. రెండు మూడు నెలలలో రెండు వందల ఖండ కావ్యాలు వ్రాశాడు. మామగారు మెచ్చుకుని వాటిని అచ్చువేయించుకోడానికి డబ్బు ఇచ్చారు. చక్కని కాగితంమీద చక్కని అచ్చుతో చక్కగా తయారయింది పుస్తకం. పుస్తకానికి "వాసనలేని పువ్వులు" అని పేరు పెట్టాడు. అతను కవిగా స్థిరపడ్డాడు అతని పలుకుబడి

అతనికి అమితమయిన ఉత్సాహాన్ని కలిగించింది. అతని చిన్ననాటి స్నేహితు లంతా, అతను ఇల్లా అయితీరతాడని తమందరకీ అప్పుడే అనిపించేదన్నారు. అతని ఉపన్యాసాలు వినడానికి వందల కొద్దీ విద్యార్థులు విద్యావంతులు మూగే వారు అతని పాటలు పద్యాలు ప్రతీ నాగరకుడి నోట్లోనూ మ్రోగేవి. రాజా రావు తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాడు. కవిగా పెరిగిన పలుకుబడి అతనికి డబ్బు లేకపోయినా, మామగారి ఆదరాన్ని సంపాదించి పెట్టింది.

*　　*　　*


అతని భార్య నూతిలోబడి చచ్చి పోయిన నాటి దృశ్యం రాజారావుకి జీవి తాంతంవరకూ జ్ఞాపకంవుంది.

అతను ఇంటికి తిరిగి వచ్చేసరికి సాయంకాలం పడుతోంది. కనుచీకట్లో అతనికి అస్పష్టంగా కొన్ని ముఖాలు, అవ్యక్తంగా కొంత హడావిడి వినబడింది. అతని ఇంటికి ముందు దొడ్డిలో ఒక పక్కగా ఒక నుయ్యి వుంది. ఆ నూతి చప్టామీద కొందరు మనుషులు, రెండు మూడు లాంతర్లు కనిపించాయి. దగ్గ రకుపోయి చూస్తే అతని భార్య శవం చప్టామీద తడి బట్టలతో, తడి తలతో వుంది. చేతివేళ్ళు కాలివేళ్ళు ముడుచు కుని వున్నాయి. అతనికి ఆమె ముఖం మాయగా అవ్యక్తంగా కనిపించింది. ఏదో చటుక్కుని మరచిపోయినట్టు అది ఎంత ప్రయత్నించినా జ్ఞాపకంరానట్టు అని పించింది అతనికి

పంచాయతీ జరిగినప్పుడు అతను అతి ప్రశాంతంగా తను చెప్పవలసిన ముక్కలు చెప్పాడు. అతని ముఖం కొంచెం ముడతలుపడ్డా స్థిమితంగావుంది. అతని జుట్టు చెదిరి చెరిగిపోయినా అందులో విచిత్రమయిన గాంభీర్యం వుంది. అతని గొంతుక దార్ఢ్యంగా మోగింది. అతన్ని చూసిన ప్రతిమనిషి, దుఃఖాలను ఇల్లాగే ఎదురుకోవాలను కున్నారు.

అతను చెప్పిన విషయాలు అందరికీ తెలిసినవే కమలకు ఈ మధ్య మూర్ఛ రోగం పట్టుకుంది. ఒకసారి పొయ్యి దగ్గిర మూర్ఛవచ్చి పడిపోతే కాలు కాలింది. అదిగో కాలుమీద మచ్చ. అవును, ఏదో సంసారంలో అనేకమయిన అభిప్రాయ భేదాలు వస్తుంటాయి. తను తిట్టేవాడు. ఆమె ఏడిచేది. అయితే మొత్తంమీద అంత పెద్ద తగాదాలు ఏవీ లేవు...అబ్బేలేదు ఆమెను అతనుహింస పెట్టాడని ఎవరూ అనలేరు. తను ఎరిగు న్నంతవరకు ఆమెఅతనిమీద అసహ్యాన్ని గాని, కోపాన్నిగాని వెలిబుచ్చలేదు. ఆమె నూతిలో నీళ్ళు తోడుతుండగా మూర్ఛ వచ్చి పడిపోయి వుంటుందని అతనికి తోచిన అభిప్రాయం చేతివేళ్ళు ముడుచుకుని వున్నాయి.

తంతు అంతా అయిపోయిన తరవాత




అతను ఇంట్లోకి వెళ్ళి నిలువుటద్దం ముందు నిలబడ్డాడు. తన ముఖం అతి విచిత్రంగా హృద్యంగా అతనికి కనిపించింది. చిందరవందరగా రేగిపోయిన జుట్టులో మళ్ళీ ఒక క్రమం వుంది. ఒక సంకీర్ణమయిన రేఖావిలాసం వుంది. కళ్ళలో ప్రగాఢమయిన విశ్వాసం వుంది. ఆ ముఖం అతని మనస్సులో నాటుకు పోయింది. చాలాసేపు ముగ్ధుడయిపోయి ఆ ముఖాన్ని చూస్తూ నిలబడిపోయాడు. ఇంతలో శ్మశానానికి శవాన్ని తీసుకు పోవడానికి అన్నీ సిద్ధంగా వున్నాయని కబురు వచ్చింది. తక్కినవన్నీ ఒక కలలోలాగ జరిగిపోయాయి.

మరునాడు మామగారు వచ్చినప్పుడు అతనికి నిజంగా దుఃఖంవచ్చింది. ఆయన్ని కౌగలించుకుని ఏడ్చాడు తన ఏడుపు నిజంగా ఏడుపులాగ ఉందా అని అతనికి సందేహం అప్పుడప్పుడు కలిగింది. మామగారు తన కర్మని తిట్టుకున్నాడు మామూలుగా జరిగే పరామర్శలన్నీ అయిపోయాయి. ఇంత యౌవనంలో ఇంత అసహజంగా పోయిన ప్రాణికి కర్మ అవీ సవ్యంగా జరపడానికి తనకు మనస్సు ఒప్పడం లేదన్నాడు రాజారావు. అతని మాటల్లోని సబబు, ఆవేదన అందరికీ నచ్చింది.

సాయంకాలం మంచం వాల్చుకుని ముందు దొడ్డిలో పడుకున్నాడు రాజారావు. ఒక మూలగా ఉంది నుయ్యి. మంచంచుట్టూ ఆ ఎర్రటి వాసనలేని పువ్వులు విరగపూశాయి. అతని భార్యకు వాటినిచూస్తే ఎంత ప్రీతి ! ప్రొద్దు కుంకుతున్నప్పుడు ఎర్రబారిన సూర్యుణ్ణి చూశాను. ఆ రంగుకీ ఈ పువ్వుల రంగుకీ ఉన్న చిత్రమయిన అను

బంధాన్ని ఆతను చటుక్కున గుర్తించాడు. ఆరంగు చూస్తుంటే మనస్సులో ఆలోచనలన్నీ ఆగిపోతాయి. ఏదో బరువు ఆవహించి మనస్సుని కిందికి లాగి వేస్తుంది ఆ రంగు చైతన్యం పూర్తిగా పోతుంది. సృష్టిఅంతా లయస్థితికి చేరి నట్టు అనిపిస్తుంది ఏ కృషికీ అవసరం కనిపించదు కాని ఈ దిగువా, ఈ బెంగ, వీటికి అడుగున ఒక ప్రశాంతి లేకపో లేదు. గాలి ఆగిపోయిన తరువాత మహా సముద్రంలాగ చైతన్యం అంతా నిలకడగా నిలిచిపోతుంది. కాని అప్పుడు చైతన్యానికే అర్థంపోతుంది వట్టిరంగు నిర్గుణమైన రంగు పరబ్రహ్మ స్వరూపం లాగా ఏకైక సత్యంలాగా తెలివినంతనీ ఆవహిస్తుంది.

అతనికి కమల జ్ఞాపకం వచ్చింది. అస్పష్టంగా ఆమె తాత్త్విక స్వరూపంలో అతనికి కనపడింది ఆమెను మనస్సులో మననంచేశాడు. ఎక్కడా వాసనలేని రంగులాగ ఆమె అతని మనస్సులో అవతరించింది తన సంస్కృతి' తన అభిరుచి, తన ఆదర్శాలు అన్నీ ఆమెకు నేర్పాలనుకున్నాడు. కాని ఆమెలో ఏ వాసనాలేదు. అతని గొడవలన్నీ ఆమెకు ఏమీ తెలియలేదు ఆమెముఖం చిట్లించి విని విని ఆవులించేది. అతనికి ఆమెను నమిలి మింగేద్దామన్నంత అసహ్యం కలిగేది ఇప్పుడామె చనిపోయింది గనుక, అతనికి ఆమెతత్వంమీద అంతకోపం కలగడంలేదు. అంతేకాదు. అసలు ఆమెను తను ఎందుకు అంతగా హింసించాడు ? ఆమె నిజతత్వాన్ని ఎందుచేత తెలుసుకోలేకపోయాడు? తన తెలివినీ, తన అభిరుచినీ, తన కళాభిరతినీ మించిన బలిష్ఠమయిన ప్రాకృతికశక్తి ఒకటి ఆమెలో ఉందని అతనికి ఎందుకు తెలియలేదు ? ఆమె భౌతిక దేహంలేదు గనుక అతనికి ఆమెను గురించి ఈర్ష్య, వ్యతిరేకభావము లేకుండా ఆలోచించడానికి సావకాశం చిక్కింది. ఈ భౌతికదేహం పెద్ద అడ్డంకి. మనుష్యుల నిజతత్వాలను స్ఫుటంగా కనబడనియ్యదు. కమలభౌతిక దేహం అతని కన్నుల కప్పివేసింది. ఆమె అసలు తత్వాన్ని కప్పివేసింది.

ఆమెతో తను గడిపిన అనేకరాత్రులు అతనికి స్మృతిలోకి వచ్చాయి ఆమె భౌతిక శరీరం తన ప్రబలమయిన చిన్న చిన్న కోరికలను అతనిమీద బలవంతంగా ప్రయోగించింది. ఆ కోరికలు అతన్ని వుక్కిరిబిక్కిరి చేశాయి. అతని ఆధ్యాత్మిక జీవితాన్ని కలిచివేశాయి. ఆ భౌతిక దేహంలేదు గనక ఇంక ఆమెకూ తనకూ మధ్య ఏ విధమయిన అంతరాయమూలేదు. ఆత్మసంయోగం, అసలయిన అద్వైతభావం తనలో ఉత్పన్నం కావడానికి ఇప్పుడే సావకాశం ఏర్పడింది.

అతను నేల నూతిచుట్టూ తిరిగాడు. నిట్టూర్చాడు. పువ్వుల మొక్కలలో



చేసు వ

ఇటూ అటూ తిరిగాడు. చెట్టుమీదవున్న పువ్వులను స్పృశించాడు. ఎంచేతో కొయ్యడం అత్యాచారంలాగ అతనికి అనిపించింది. చెక్కులమీద వాటిని రాసుకున్నాడు. బాగా చీకటి వడ్డతరవాత లోపలికి వెళ్ళిపోయాడు. దీపం బాగా పెద్దదిచేసి నిలువుటద్దం ముందు నిలబడ్డాడు. నున్నగా దువ్వినజుట్టు అతనికి వెగటుగా తోచింది. చేత్తో దాన్ని జాగ్రత్తగా చెరుపుకున్నాడు. పూర్తిగా చెరుపుకోలేదు. దువ్వెనతో ఇక్కడా అక్కడా జాగ్రత్తగా సర్దుకున్నాడు. ఆనాటి రాత్రి తన జుట్టు ఎల్లావుందో అల్లాగ సరిదిద్దుకున్నాడు. ఆ మూర్తి అతన్ని అనంతమయిన ప్రశాంతితో నింపుతుంది ఎంతో సంతృప్తిగా ఉంటుంది. తన ఆత్మస్వరూపాన్ని కన్నులార చూస్తున్నానని అతను అనుకుంటాడు. రోజూజాగ్రత్తగాఆస్వరూపం వచ్చేదాకా జుట్టు రేపుకుంటాడు. అతి జాగ్రత్తగా ఆనాటి దుస్తులవంటివే వేసుకుంటాడు నిద్రలో కూడా అతనికి తనజుట్టుయొక్క స్వరూపం కళ్ళకు కట్టినట్టు వుంటుంది.

*   *   *

రాజారావు సాహిత్యప్రపంచంలో ఉన్నత స్థానాన్నిసంపాదించుకున్నాడు అతని జీవితంలో లౌకికమయిన సాఫల్యం ఉంది, ఆధ్యాత్మిక మయిన సాఫల్యమూ ఉంది. విద్యావంతులు, కవులు, వైజ్ఞానికులు, వేదాంతులు, అందరూ అతన్ని గౌరవిస్తారు. అతని వయసు నడిపొద్దు వాలి పశ్చిమానికి దిగిపోతోంది. అతని ప్రతిభ ఒకప్పుడు తీక్ష్ణంగా వెలిగింది. ఇప్పుడు ప్రశాంతమయిన సాయం సంధ్యా కాంతిలాగ ప్రకాశిస్తోంది అతను వెనక్కి తిరిగి చూస్తే ఒక ఉజ్వలమయిన జీవితచరిత్ర కనబడుతుంది.

రాజారావుమళ్ళీ వివాహం చేసుకోలేదు. అతని ఏకనిష్ఠ ప్రేమ అందరికీ గౌరవపాత్రమయింది. చిన్న వయసులోనే భార్యపోయి, ఇంతవరకు ఆమె స్మృతినే ప్రేమిస్తూ గౌరవిస్తూ దైహిక వాంఛలను, సాంసారిక జీవితాన్ని త్రోసిపుచ్చిన యోగులు చాలా అరుదు అన్నారు తత్వజ్ఞులు


భార్యపోయిన తరవాత ఎన్నో కావ్యాలు వ్రాశాడు రాజారావు. ఖండ కావ్యాలు, పెద్దకావ్యాలు కూడా. రకరకాల వ్యాసాలు వ్రాశాడు...ముఖ్యంగా జీవితాన్ని గురించి, ఆశయాలను గురించి, ప్రేమను గురించి, అతని కవిత్వం మాయగా తెలియని ఆవేదనను కలిగిస్తుంది. అతని వ్యాసాలు, పూర్తిగా తెలియడానికి వీలులేని దేన్నో ప్రతిపాదిస్తాయి మొత్తంమీద అతని శక్తిని అందరూ గుర్తించారు.

చివరకు అతను తన ఖండకావ్యాలన్నీ ఒక పెద్ద సంపుటిగా అచ్చు

వేశాడు. ఆ పుస్తకాన్ని తన భార్యకు అంకితమిచ్చాడు. పుస్తకానికి 'మరికొన్ని వాసనలేని పువ్వులు' అని పేరుపెట్టాడు. ఆ పుస్తకంలో ఉపోద్ఘాతం ఒకటి వ్రాశాడు. అది అతనికి సర్వజనామోదాన్ని, కీర్తిని సంపాదించి పెట్టింది. ఒక కవి కవిత్వానికి, ఆతని జీవితానికీ గల అనుబంధాన్ని అంత అద్భుతంగా చిత్రించగల రచయిత ఇంకెవడూ లేడన్నారు విమర్శకులు. అన్ని పత్రికల లోనూ ఆ ఉపోద్ఘాతాన్ని కొనియాడుతూ వ్యాసాలు పడ్డాయి. అతని షష్ఠిపూర్తి సందర్భంలో కూడా ఆ ఉపోద్ఘాతాన్నే ఎంతోమంది పొగిడారు. చిన్న కవులందరూ అతన్ని కవి కులగురువుగా అంగీకరించారు. ఆ ఉపోద్ఘాతంలోని కొన్నిభాగాలను ఇక్కడ ఉదహరిస్తాను :

"నాకు పెళ్ళయిన కొత్తరోజుల్లో ప్రేమ అంటే ఏమిటి? అనే ప్రశ్న వచ్చింది నాకు శారీరకమయిన వాంఛల మీద ఏహ్యాభావం ఆనాటినుంచి వుంది. అంచేత దైహికమయిన వైషికమయిన వాంఛలను నేను ప్రేమగా ఎప్పుడూ అర్థంచేసుకోలేదు. కాని నాకు పెళ్ళయిన మొదటి కొద్దిరోజులు నా జీవితంలో అంధకారం ఆవరించిన రోజులని చెప్పి తీరాలి. నా భార్య, కమల, చాలా అమాయకురాలు ఆమె శరీరసౌష్ఠవం అనుపమానం. కాని ఆమె దేహాన్ని నేను ప్రేమించలేకపోయాను. 'ప్రేమ' అనే పదానికి నా అర్థం ఏమిటో ఆమెకు వ్యక్తం చెయ్యడానికి నేను అనేక రకాలుగా ప్రయత్నించాను. కాని ఆమె నా భౌతిక దేహాన్ని చాలా తీవ్రంగా వాంఛించేది. నాకు కొన్ని రాత్రులు ప్రబలమయిన ఉద్రేకాలు వస్తుండేవి. దైహిక ప్రేమలో నేను మునిగిపోలేక పోయాను. నా దేహమే దానికి అంగీకరించలేదు. కాని నా కమలకు ఎల్లాగ నా అభిప్రాయాలు వివరించడం? ఎల్లాగ ఆమెను నా త్రోవలోకి తీసుకురావడం?

"కాని పరిస్థితి విషమించింది ఆమె రాత్రులు ఏదో వైఫల్యంతో గోడపక్కన కూర్చుని అకారణంగా ఏడుస్తుండేది. నాలో చిరాకు వర్షపు హోరులాగ హెచ్చేది. ఈ పరిస్థితి భరించలేక నేను ఆమెను కొట్టడం ప్రారంభించాను. అప్పటి నా రాక్షసత్వానికి మితిలేదు. కాని దెబ్బలు తిన్నతరవాత ఆమె కొంత ప్రశాంతంగా పడుకునేది. ఆ రోజుల్లో నా హృదయం అంతా నల్లబడిపోయినట్టనిపించేది చేయరాని ఘోరపాపాలు అన్నీ నేనే చేస్తున్నాననిపించేది కమలకు మూర్ఛరోగం పట్టుకుంది. క్రమంగా ఆమె దేహసౌష్ఠవం పోయింది. దీనికంతటికీ నేనే కారణమని నా నైతిక స్వభావంలో నాకు అనిపించేది. కాని నా కృషి గొప్పది. ఏమయినాసరే నా జీవిత సాఫల్యాన్ని నేను చూసుకోవాలి. దానికి దైహిక వాంఛలను చంపాలి.




"ఇంతలో కమల చచ్చిపోయింది. ఆరోజున నాకు చిత్ర విచిత్రమయిన ఊహలు వచ్చాయి. అవన్నీ నేను స్పష్టముగా చెప్పలేను. నా పద్యాల్లో ఈనాటి వరకూ కూడా ఆనాటి ఊహలను వ్యక్త పరచడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాను. నా శరీరంలోని బాహ్యమయిన మార్పులు కొన్ని ఆ నాడు కనిపించాయి. నా దృష్టిని కప్పిన పొరలు తొలగి పోయాయి.

............

"నా అభ్యుదయ మిత్రులతో నేను అంటుంటాను. సహజపరిణామం కవి లోనే రావాలని. కవి లోపలినించే పెరుగుతాడు. అతని అనుభూతులే అతని సత్యాసత్యాలను నిరూపించాలి గాని, కొన్ని బాహ్య సిద్ధాంతాలు కాదు. సామ్యవాది స్నేహితులందరూ ఒకటి గమనించాలి. కవి జగత్తులో ఆర్థిక సమస్యలు లేవు. అవి ఈ లౌకిక జగత్తును ఆశ్రయించి వుంటాయి. ఆధ్యాత్మికమయిన సమానత్వం అన్నిటికంటే గొప్పది. అసలయిన సామ్యసిద్ధాంతం అది......

"స్త్రీ ప్రేమను గురించి రకరకాల సిద్ధాంతాలు ఈనాడు మనం వింటున్నాం. చాలావరకు అవన్నీ పాశ్చాత్య దేశాల నించి దిగుమతి అయిన అభిప్రాయాలు. మన హైందవ సంప్రదాయంలో స్పష్టమయిన నిర్వచనం దీనికి ఇచ్చారు. ఔత్కృష్ట్యాన్ని గమనించడానికి చిత్త సంస్కారం కొంత అవసరం. స్త్రీ ఎవరో వుంటే తప్ప స్త్రీ ప్రేమ అసంభవమని ఆధునికుల అభిప్రాయం ప్రేమకు స్త్రీ నిమిత్తమాత్రమని నా అనుభవంద్వారా నేను తెలుసుకున్నాను. ఉదాత్తమయిన ప్రేమకు ఈ లోకంలో ఏ స్త్రీ కూడా అర్హురాలుకాదు. నా ప్రేయసికి ఈ లోకం వాసయోగ్యంకాదు. ఈ కామలోభాలతో కలిసివున్న వాస్తవిక స్త్రీని నేను ప్రేమించలేను. వాంఛించలేను.

ప్రేయసి ఈ లోకంలోని ఉదాత్తమయిన స్త్రీత్వానికి ప్రమాణం.

"మహా కవులందరూ అందుకే కామాన్ని తెగనాడారు. టాల్‌స్టాయి అసలే స్త్రీ పురుష సంయోగం పాపమన్నాడు. అందరు మహాకవుల జీవితాలను పరిశీలించగా నాకు దొరికిన మహాసత్యం ఇది. కవి కాదగినవాడు దైహిక వాంఛలకు లొంగిపోలేడు. కాని లోకమంతా వాటి ప్రాబల్యంతో నిండిపోయి వుంది. అంచేత కవి లోకాన్ని ధిక్కరించవలసి వస్తోంది. కుటుంబజీవితంలో అంచేత కవికిఘర్షణతప్పదు.కవికి-కవికే కాదు ఆత్మసంస్కృతి కాంక్షించే ప్రతి సాధకుడికీ-ఒక కుటుంబం, సంసారము అనేవి కుదరవు.

"కాని నా భార్యను నేను ప్రేమించాను. అమితంగా ప్రేమించాను. అయితే ఆమె దేహసౌష్ఠవాన్ని కాదు. ఆ దేహ సౌష్ఠవం నాకు ఎంతో ప్రతిబంధకంగా అయిపోయింది. దాన్ని నేను అసహ్యించుకునేవాడిని. కాని ఆమె ఆత్మహత్య విచిత్రమయినది. అనంతమయిన ఎర్ర రంగు దానికి సాంకేతికం. వాసనలేని ఎర్రరంగు. ఆమెకు విశాలమయిన సంస్కారాలులేవు. కాని ప్రాథమయిన స్వభావం ఏదో ప్రబలంగా ఆమెలో ఆవరించివుంది.మావాకిటిలో నిత్యమూ పూసే అద్భుతమయిన వాసనలేని ఎర్రపువ్వులకూ ఆమెకూ ఏదో ఆత్మీయమయిన అనుబంధం వుందని నాకు తెలిసివచ్చింది. ఇది అనుమానంకాదు. పరమసత్యం.

"ఒక్కొక్కప్పుడు ఆమె మృత్యువుకి నేనే కారణభూతుడినని అనిపిస్తుంటుంది. నాకంటే ఒక సామాన్య మానవుడికి ఆమె భార్య అయితే ఆమెకు ఈ తీవ్రమయిన వాంఛలు తీరకపోవడం, మూర్ఛ పట్టుకోడం జరగకపోనేమో. నా వల్ల ఆమె దైహికజీవితం ఎండిపోయిందేమో. అయితే ఎవరికి ఏం కావాలో స్పష్టంగా వారికయినా ఈ సృష్టిలో తెలియడానికి వీలులేదు నవీన మనశ్శాస్త్రజ్ఞులు కూడా ఇదే అంటారు. మన వాంఛలన్నీ అజ్ఞాతంగావుంటాయి కాని ఆమె పోయినతరవాత నాకొక అపురూపమయిన దివ్యమూర్తిగా అయిపోయింది. ఆమె నా స్మృతిపథంలో ఎప్పుడూ జ్యోతిలాగ వెలుగుతూ ఉంటుంది.

"ఇల్లాంటి అనుభవాలన్నీ అప్పుడప్పుడు కావ్యరూపంలో వెలువడుతూ వచ్చాయి. నా జీవితాన్ని ఒక సాధనగానే నేను గ్రహించాను. ఇందులో సాఫల్యం ఎంతవరకు వుందో తేల్చవలసినవారు మీరు."

---